

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

### - 54 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

. 'స్వామీ! ప్రణామములు. మరాఠా మహాసేనాధిపతి చంద్రసేనులవారు, సతీ సమేతులై తమరి దర్శనం కోసం వేచివున్నారు' వినయంగా వంగి నమస్కరించి చెప్పాడు మరాఠా సైనికుడు.

'సంతోషం! వారికి ఆహ్వానం' అన్నాడు భాస్కర రాయలు. సంభాషణ అంతా స్వచ్ఛమైన మరాఠీలో జరుగుతున్నది. 'చిత్తం' అని వెళ్ళిపోయాడు సైనికుడు.

గురుదేవులకు సాష్టాంగనమస్కారం చేసి తలవంచుకున్నాడు నారాయణుడు. నీరునిండిన కనులను ఉత్తరీయంతో అద్దుకున్నాడు. ఆతడు అయిదు సంవత్సరాలుగా గురుసేవ చేసిన ఫలితం లభించింది. వాగ్దేవీమంత్ర ఉపదేశం లభించింది. గురుదేవుల అనుమతి లభించింది. ఇక వీడుకోలు తీసుకుని వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. గురుదేవులను వీడి వెళ్ళిపోవడానికి మనసురాక కన్నీరు పెడుతున్నాడు.

'వెళ్లిరా నాయనా! అమ్మ అనుగ్రహం లభిస్తుంది నీకు. మంత్రసిద్ధి కలుగుతుంది. శుభం!' అని శెలవిచ్చాడు గురుదేవుడు. మరొకసారి ప్రేమగా పాదములను తడుముతూ గురువుదేవుడికి నమస్కరించాడు నారాయణుడు. జగన్నాథుడిని కౌగలించుకుని 'గురుదేవుడిని జాగ్రత్తగా చూసుకొ'మ్మని అప్పగింతలు పెట్టి నెమ్మదిగా వెళ్ళిపోయాడు. ద్వారం వరకూ వెళ్లి ఆతడికి సాదరంగా వీడుకోలు పలికి లోపలకు వచ్చాడు జగన్నాథుడు. అతిథుల కోసం ఆసనాలు సిద్ధం చేశాడు. గురుదేవుడికి నమస్కరించి బయటకు వెళ్ళాడు.

కొన్ని క్షణాల తరువాత అతిథులను గౌరవంగా లోపలకు తోడ్కొని వచ్చాడు. చేయి ఎత్తుమనిషి చంద్రసేన జాదవ్. మరాఠా సామ్రాజ్య సర్వసైన్యాధ్యక్షుడు. ఔరంగజేబును గడగడలాడించిన ధనాజీ జాదవ్ కుమారుడు. కంచుతో చేసిన విగ్రహంలా వున్నాడు. తీక్ష్ణమైన కనులు, కోరమీసాలతొ గంభీరంగా వున్నాడు. మేలిముసుగులోనుండి కాంతులను విరజిమ్ముతున్నది ఆయన సతీమణి ముఖం. భాస్కరరాయలవారి పాదాలకు నమస్కరించి, ఆసీనులైనారు దంపతులు.

మహావీరుడు ప్రతాపరావు సారధ్యంలో, తన పోరాటపటిమతో చత్రపతి శివాజీ మహారాజ్ ప్రశంసలు పొందిన యోధుడు ధనాజీజాదవ్. మరాతా సామ్రాజ్యానికి మూలస్థంభాలలో ఒకడు అని ఛత్రపతిచేత పొగడ్తలు అందుకున్నవాడు. ధనాజీ మరణం తరువాత ఆయన కుమారుడు చంద్రసేన జాదవ్ మరాతా సైన్యాధిపతి అయినాడు.

'సంతానం లేదని దిగులుపడుతున్నావా తల్లీ?' అని అడిగాడు భాస్కర రాయలవారు వాత్సల్యంగా. దంపతులు యిద్దరూ తలలూపారు ఆశ్చర్యపోతూనే. పక్కనే వున్న పళ్ళగంపలోనుండి నవనవలాడుతున్న మామిడిపండును తీసుకున్నాడు భాస్కరరాయలు. అంతకుముందే గురుదేవుడికి వీడ్కోలు పలుకుతూ నారాయణుడు సమర్పించిన పండ్లు అవి. నిముషంపాటు కనులుమూసుకుని ఒక దివ్యమంత్ర మననం చేస్తూ ఆ పండును మంత్రించి దంపతులకు ప్రసాదంగా యిచ్చాడు భాస్కరరాయలు. 'పుత్ర సంతానం కలుగుతుంది' అని ఆశీర్వదించాడు. క్షేమంగా వెళ్ళిరమ్మని అనుజ్ఞ యిచ్చాడు. నమస్కరించి వెళ్ళిపోయారు దంపతులు.

కనులు మూసుకుని ధ్యానమగ్నులైనారు భాస్కర రాయలవారు. ఆయన మనసు బ్రాహ్మీ ముహూర్తంలో మేలుకునేముందు చూసిన కలపైకి వెళ్ళింది. ఎక్కడో, ఎంత ప్రాచీనమైనదో కాళికాలయం! ఎదురుగా ఒక దివ్యతేజస్సంపన్నుడైన యువకుడు! యేవేవో స్తుతులు స్తోత్రాలు ధారాపాతంగా వెలువరిస్తున్నాడు. కాళీవిగ్రహం ప్రాణం పోసుకున్నది. మడమలకు తాకుతున్న జుత్తు, మెడలోని పుర్రెల మాలిక ఎగిరిపడేలా విరగబడి నవ్వుతున్నది. యింతలోనే ఆమె రూపం మారిపోయింది. శ్యామలగా దర్శనం యిచ్చింది! దివ్యమైన వీణానాదం చెవులకు అమృతం కురిపిస్తున్నది. ఇంతలో సరస్వతిగా, అంతలోనే 'బాల'గా తేరుకునేంతలో శ్రీమహాలక్ష్మిగా కనిపించింది. మరలా మహాకాళివిగ్రహంగా మారిపోయింది.

ఇంతలో ఒళ్ళు జలదరించేలా ఏదో మహాఖడ్గం ఒక మెరుపులా మెరిసింది. అలుపూ సొలుపూ లేకుండా స్తోత్రం చేస్తున్న ఆ పురుషుడి కంఠం ఒక్కవేటుకు బంతిలా ఎగిరి కాళీవిగ్రహం పాదాలమీదపడిపోయింది. ఆ శిరస్సునుండి చిమ్ముతున్న రక్తంతో కాళి పాదాలు తడిసిపోతున్నాయి. అయినా ఆ స్తోత్రపఠనం ఆగిపోలేదు. శిరస్సులేని మొండెం చేతులు జోడించి అలా నిలుచునే వున్నది. ఆ మెడనుండి రక్తం అంతెత్తున పైకి చిమ్ముతూనే వున్నది. ఆ పురుషుడి శరీరం అమ్మవారి 'ఛిన్నమస్తక' మూర్తిగా మారిపోయింది!

కాళి పాదాలవద్ద వున్నశిరస్సు పెద్ద కదంబపుష్పంగా మారిపోయింది. 'కాదంబ కాంతారవాసప్రియే!

కృత్తివాసప్రియే' అని దివ్యమైన స్తోత్రం ఏదో వినిపిస్తున్నది. శరీరమంతా పులకలు రేగి, మాటలలో వర్ణించలేని మహదానందం మనసంతా అలుముకున్నది. చప్పున మెలకువ వచ్చింది.

'తమరి దర్శనం కోసం ఆంధ్రదేశంనుండి ఎవరో మహానుభావులు వచ్చారు స్వామీ' అన్న జగన్నాథుడి కంఠం వినిపించి కనులు తెరిచారు భాస్కర రాయలు. 'సరే' అన్నట్లుగా తల పంకించాడు. బయటకు వెళ్లి మదరపండిన మామిడిపండులా వున్న ఒక వృద్ధమూర్తిని లోపలికి తీసుకొచ్చాడు జగన్నాథుడు.

'... ఆంగీరస, బార్హస్పత్య, భారద్వాజస త్రయార్షేయ ప్రవరాన్విత భారద్వాజ గోత్రోద్భవస్య, ఆశ్వలాయన సూత్ర, ఋగ్వేదాధ్యాయీ, అక్కుభొట్ల శర్మాణం అహంభో అభివాదయే' అని తన ప్రవర చెప్పుకుని నమస్కరించాడు ఆ వృద్ధుడు. చెవులకు రుద్రాక్షలు, నుదుట నిండైన కుంకుమ బొట్టు, శిఖతో ప్రజ్వలిస్తున్న అగ్ని శిఖలా వున్నాడు ఆయన. ఆ పేరు చెవుల బడుతుండగానే పరవశంగా లేచి నిలుచున్నాడు భాస్కరరాయలవారు. ప్రేమగా గౌరవంగా రెండు చేతులూ జోడించి ఆయన కనులలోకే చూస్తూ వుండిపోయాడు

కొంతసేపు. తను వంగి ఆయన పాదాలకు నమస్కరించబోయాడు. చప్పున వారించి భాస్కరరాయల బాహువులను పట్టుకుని 'దేవీ స్వరూపులు, మహామంత్రవేత్తలు మీరు! అపచారం, అపచారం అన్నాడు చిరునవ్వులు చిందిస్తూ. ఇద్దరూ ప్రేమగా, ఆదరంగా చూసుకుంటూ వుండిపోయారు కొన్నినిముషాలు.

పాఠకుడా! సర్వసాక్షి ఐన కాలాన్ని నేను! నేనూ పరవశించిపోయే మధుర స్మృతులలో ఆ యిద్దరు మహాపురుషుల ఆనాటి కలయిక ఒకటి. నీ అదృష్టం! నీకూ ఆ మధురస్మృతిని నాతో పంచుకునే భాగ్యం కలిగింది! నా మనసుపొరలలో పదిలంగా దాచుకున్న నిజాలను వెల్లడిస్తున్నాను! విశ్వసించి తరిస్తావో, విదిలించి పారేస్తావో, నీ ప్రాప్తం!

ఆ శతాధిక వృద్ధుడు అక్కుభొట్లు విజయవాడకు, ఖమ్మంమెట్టుకు మధ్యప్రాంతం వాడు. జమలాపురిగా ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రానికి పునాది ఆయన! ఖమ్మంమెట్టుకు ఆగ్నేయంగా అరవైమైళ్ళ దూరంలో శ్రీవేంకటేశ్వరుడు స్వయంగా వెలసిన పుణ్యక్షేత్రం ఆ జమలాపురి. జమిలివాగులు, అంటే రెండు వాగులు చుట్టి పారుతున్న గ్రామం కనుక అది జమిలివాయి అయింది. అదే జమలాపురిగా మారింది. ఆ వాగులు పుట్టిన దివ్యమైన పర్వతం గంభీరమైన సూచీగిరి. సూదిలా పదునైన శిఖరం మైళ్ళదూరానికి కనిపించే కొండ కనుక అది సూచీగిరిగా, సూదిగుట్టగా ప్రసిద్ధమైంది!

కలియుగ ప్రారంభంలో సూదిగుట్టమీద స్వయంగా వెలసిన వేంకటేశ్వరుడిని జాబాలి మహర్షి అర్చించాడు. ఆ తరువాత ఆ బాధ్యత ఆయన తన శిష్యుడు యజ్ఞనారాయణ శర్మకు అందించాడు. జమిలివాయికి చెందిన యజ్ఞనారాయణశర్మ వంశంలో నాలుగవ తరం వాడు అక్కుభొట్లు. వంశపారంపర్యంగా వచ్చిన సూదిగుట్ట శ్రీ వేంకటేశ్వరుడి అర్చనకోసం కొండను ఎక్కుతున్న అక్కుభొట్లు ఒకనాడు ఎండకు తట్టుకోలేక కళ్ళు తిరిగి పడిపోయాడు. నివేదనకోసం మోసుకొస్తున్న ప్రసాదం కొండరాళ్ళ పాలైంది. తలకు తీవ్రమైన గాయాలతో మరణావశిష్టుడైనాడు అక్కుభొట్లు. అంతటి బాధలోకూడా 'అయ్యో నిన్ను ఈరోజు పస్తు ఉంచాల్సిన దౌర్భాగ్యం పట్టింది స్వామీ! ఇక ఈ తిప్పలు నీకూ నాకూ వద్దు. నువ్వు కొండ దిగి రానైనా రా! లేదా నా ప్రాణాలైనా తీసుకో అని కొండరాళ్ళకు తలను బాదుకుంటూ విలపించాడు. వేంకటేశ్వరుడు కనికరించి తన దివ్య వాణిని వినిపించాడు. 'సరే! వెనుకకు తిరిగి చూడకుండా కొండ దిగు! నీవెనుకే నేను వస్తాను! ఏమి వినిపించినా, ఏమి జరిగినా వెనుకకు తిరిగి చూడకు! నువ్వు వెనుకకు తిరిగి చూసిన దగ్గరే నేను ఆగిపోతాను. ఇక కదలను!' అని ఆదేశించాడు.

సంతోషంగా స్వామి నామస్మరణ చేస్తూ కొండ దిగడం మొదలుబెట్టాడు అక్కుభొట్లు. క్రమ క్రమంగా విచిత్రమైన, భయంకరమైన ధ్వనులు తన వెనుకనుండి వినిపించడం మొదలైంది. అంతకంతకూ పెరుగుతున్న ఆ ధ్వనులకు ఆందోళన చెందుతూ, వెనుకకు తిరిగి చూశాడు అక్కుభొట్లు. భూమ్యాకాశాలు బ్రద్దలయ్యే ధ్వని వినిపించింది. దివ్యమైన కాలిముద్ర ఆ కొండమీద అక్కడే

చూస్తుండగానే వెలిసింది! ఒకదివ్యమైన జ్యోతి స్వరూపం ప్రత్యక్షమైంది. 'ఇక యిదే నా నిలయం! నా సేవలో నీవూ నీవారసులూ తరింతురు గాక!' అన్న పలుకులు వినిపించాయి. ఆ దివ్యజ్యోతి అదృశ్యమైంది! పాతకుడా అంతటి మహాభక్తుడు ఆ శతవృద్ధుడు అక్కుభొట్లు!

గౌరవంగా అక్కుభొట్లను కూర్చోబెట్టాడు భాస్కరరాయలు. ఆయన ప్రత్యేకంగా అంత దూరంనుండి వచ్చిన కారణం అడిగాడు. ఒక్క నిముషం సాలోచనగా మౌనంగా వుండిపోయాడు అక్కుభొట్లు. వెనుకకు తిరిగి 'లక్ష్మీధరా!' అని పిలిచాడు. ఆ పేరు వినగానే ఒక్క నిముషం మనసు చలించిపోయింది భాస్కరరాయలకు. నెమ్మదిగా లోపలకు వచ్చి రెండు చేతులూ జోడించి నమస్కరించాడు నవయువకుడొకడు. మిట్టమధ్యాహ్నం రోహిణీకార్తె ఎండలా కనులు జిగేలుమనిపించే వర్చస్సు ఆ యువకుడిది. రెండు చేతులూ జోడించి తీయని కంఠంతో 'చతుస్సాగర పర్యంతం..'అని తన పరిచయం మొదలుపెట్టాడు.

భాస్కరరాయలకు అతడి కంఠం ఎక్కడో విన్నట్టు అనిపిస్తున్నది. మహామంత్రవేత్త ఐన ఆయన మంత్రముగ్ధుడై ఆ యువకుడి ముఖంలోకే చూస్తున్నాడు. ఎన్నోసార్లు ఎక్కడో చూసిన ముఖమే! మెరుపులా ఆయనకు స్ఫురించింది. మైసూరు చాముండిని సేవించి తిరిగి వస్తూ పెనుగొండ దుర్గంలో చూసిన తైలవర్ణచిత్రంలోని మహానుభావుడి రూపం గుర్తుకొచ్చింది. అదే రూపం. అదే నవ్వు. అదే వర్చస్సు! ఆ నిలువెత్తు తైలవర్ణ చిత్రం మహామంత్రవేత్త, దేవీ ఉపాసకుడు, శ్రీకృష్ణ దేవరాయల ఆస్థాన విద్వాంసుడు లొల్లా లక్ష్మీధరపండితుడిది.

గజపతుల ఆస్థానంలో అపర శంభునిలా పూజలందుకున్న మహామహోపాసకుడు లక్ష్మీధరపండితుడు. శ్రీకృష్ణదేవరాయలు గజపతులను జయించిన తరువాత రాయల ప్రార్థనపై ఆయన కొలువును అలంకరించాడు. శ్రీకృష్ణదేవరాయల మరణం తరువాత సరిగ్గా సంవత్సరానికి లక్ష్మీధర పండితుడు అమ్మవారిలో ఐక్యమయ్యాడు. జగజ్జనని బీజాక్షరాల సంపుటీకరణతో ఆయన హోమం చేస్తున్నప్పుడు అమ్మవారు అగ్నిశిఖలలో దర్శనమిచ్చేది అని ప్రతీతి! ఆ లక్ష్మీధరుడే మరలా అదే పేరుతో జన్మించాడా అన్నట్లు వున్నాడు ఈ యువకుడు.

వున్నట్టుండి సంభ్రమంతో, ఆనందంతో ఒక్కసారిగా పులకింతలతో చలించిపోయాడు భాస్కరరాయలు. ఆయనకు ఒక్కసారిగా స్ఫురించింది! రాత్రి తను కలలో చూసిన యువకుడి ముఖం అచ్చం ఇలానే వుంది. ఆ లక్ష్మీధరపండితుడి ప్రతిబింబంలా వున్న ఈ లక్ష్మీధరుడి ముఖమే తనకు కలలో కనిపించింది! యిదే కంఠం, యిదే మధురమైన కంఠం తను కలలో విన్నది.

ఆయన మనసును చదివినవాడిలా అందుకున్నాడు అక్కుభొట్లు. 'ఆ మహానుభావుడు లొల్లా లక్షి ధర పండితుడి మునిమనుమడి కొడుకు ఈ లక్ష్మీధరుడు' అన్నాడు. ఆ పరిచయానికి మరొకసారి వినయంగా నమస్కరించాడు ఆ యువకుడు. అవే శరీర కదలికలు! అవే ముఖ కవళికలు! అవే జోడించిన చేతులు. పరిశీలనగా చూస్తున్నాడు భాస్కరరాయలు.

'యితగాడు నాకు మేనల్లుని కొడుకు' అని రెండు క్షణాలు మౌనం వహించి మరలా మొదలుబెట్టాడు అక్కుభొట్లు. కొంతకాలంగా ఒక మహాసర్పం వీడిని వదలకుండా వెంటబడుతున్నది. అది ఒక దేవతా సర్పం!' అన్నాడు అక్కుభొట్లు.

## (కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS